దుర్గమ్మా.. మముబ్రోవుమా..


బాపట్ల సత్యనారాయణ స్వామి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనం


వేటపాలెం కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళల పూజలు

దసరా మహోత్సవాలు ఊరూవాడా ఘనంగా జరుగుతున్నాయి. గురువారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కుంకుమ పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, బాపట్ల, వేటపాలెం, చెరుకుపల్లి


చెరుకుపల్లి : దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

పారదర్శకంగా మద్యం టెండర్ల ప్రక్రియ


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎక్సైజ్ డీసీ హేమంత్ నాగరాజు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు హేమంత్ నాగరాజు పేర్కొన్నారు. ఏ దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో అందరూ పరిశీలించుకునే వీలుగా ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. చీరాల ఎక్సైజ్ స్టేషనును ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో అద్దంకి, చీరాల, బాపట్ల, వేమూరు, రేపల్లే, పర్చూరు, నగరం పరిధిలో ఏడు సర్కిల్స్ ఉన్నాయన్నారు. వీటిలో ప్రభుత్వం కేటాయించిన 117 దుకాణాలకు ఇప్పటి వరకు 1350కిపైగా దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం అయిదు గంటలతో ఈ ప్రక్రియ ముగుస్తోందన్నారు. చివరి రోజున ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. చీరాల సర్కిల్ పరిధిలో 24 దుకాణాలకు 276 దరఖాస్తులు వచ్చాయన్నారు. 14న బాపట్లలో లాటరీ పద్ధతి ద్వారా దుకాణాల కేటాయింపు జరుగుతోందన్నారు. 16 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తోందని చెప్పారు. ఈ తనిఖీలో సీఐ పేరం నాగేశ్వరరావు, ఎస్సై శ్రీహరి, సిబ్బంది ఉన్నారు.

అడ్డగోలు దోపిడీ

* ట్రావెల్స్ బస్సుల్లో ఆకాశాన్నంటుతున్న ఛార్జీలు * దసరా పేరిట ఇష్టానుసారంగా వసూళ్లు

న్యూస్‌టుడే, గుంటూరు, బాపట్ల

తెలుగు ప్రజలు ఇంటిల్లిపాదీ ఆనందోత్సవాలతో జరుపుకొనే పెద్ద పండగల్లో దసరా ఒకటి. సంక్రాంతి తర్వాత విజయదశమికి ఎక్కడెక్కడి వారంతా సొంత ఊళ్లకు వస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు తమకు ఇష్టం వచ్చిన విధంగా ఛార్జీలు పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. 12న విజయదశమి కావడంతో వివిధ నగరాల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాకు వచ్చేవారు ఎంతో మంది ఉంటారు. విశాఖపట్టణం, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రైళ్లల్లో బెర్తులు ఎప్పుడో నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా బస్సుల్నే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులు ఛార్జీలు అమాంతం పెంచేశారు. ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నారు.



ప్రైవేటు బస్సు ఛార్జీలు ఇలా.. (రూ.ల్లో)	సాధారణ రోజుల్లో	దసరా పండగకు
హైదరాబాద్ నుంచి బాపట్ల	600 – 800	1500 – 1800
విశాఖ నుంచి గుంటూరు	600 – 800	1500 – 2000
చెన్నై నుంచి గుంటూరు	800 – 900	2000 – 2500
బెంగళూరు నుంచి బాపట్ల	1800 – 2400	2600 – 3000

అదనపు భారమే..

పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో జిల్లాకు చెందిన ఎంతో మంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉన్నత చదువుల నిమిత్తం విద్యార్థులు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్టణం వంటి నగరాలకు వెళ్లారు. దసరా పండగకు ఇంటికి వెళ్లి బంధుమిత్రులతో సరదాగా గడుపుదామని వివిధ నగరాల నుంచి పయనమవుతున్న వారి నుంచి ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు ఛార్జీల రూపంలో దండుకుంటున్నారు. సాధారణ రోజుల్లో వసూలు చేసే ఛార్జీల కంటే రెట్టింపు చేసి దోచుకుంటున్నారు. సొంత ఊరికి రావాలనే ఉత్సుకతో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు అడిగినంత సొమ్ము ముట్టచెప్పి టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు. తిరిగే వెళ్లే సమయంలో టిక్కెట్లు దొరుకుతాయో లేదోనని 13వ తేదీకి ఇప్పుడే బుక్ చేసుకుంటున్నట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు తెలిపారు. సాధారణంగా ఆదివారాల్లో డిమాండ్ బాగా ఉంటుంది. దసరా తర్వాత తిరుగు ప్రయాణం ఆదివారం కలిసి రావడం వల్ల డిమాండ్ మరీ అధికంగా ఉంది. దీంతో ప్రైవేటు బస్సు ఆపరేటర్ల వ్యవహారం ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. అదనపు ఛార్జీల వసూలు భారమేనని చెన్నైలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి ఒకరు వాపోయారు.

మద్యం దుకాణాలకు 1416 దరఖాస్తులు


మాట్లాడుతున్న డీపీఈవో దేవదత్తు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 117 మద్యం దుకాణాలకు రెండేళ్ల లైసెన్స్ కోసం గురువారం సాయంత్రానికి మొత్తం 1416 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(డీపీఈవో) జి.దేవదత్తు తెలిపారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో అందజేయవచ్చన్నారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో ఈ నెల 14న దుకాణాల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో నుంచి లాటరీ తీసి ఎంపికైన వారికి లైసెన్స్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆరోజు ఉదయం 7 గంటలకు కల్యాణ మండపం వద్దకు హాజరు కావాలన్నారు. సమావేశంలో సీఐ గీతిక పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలి


ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

బాపట్ల, న్యూస్‌టుడే: డిగ్రీ, ఆ పై చదువులు చదివిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరుగుతాయన్నారు. 2007 నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఫోరంగా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ప్రజాతంత్ర హక్కులను కాపాడటానికి నిజాయతీతో పనిచేస్తున్నారన్నారు. ఈ నెల 31 లోపు డిగ్రీ లేదా డిప్లొమా పొందిన వారంతా ఓటర్లుగా నమోదు కావచ్చన్నారు. ఓటర్ల నమోదు కోసం యూటీఎఫ్ కార్యాలయాల్లో అయిదు ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటర్లుగా చేరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.భిక్షాలు బాబు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులు పి.రామాంజనేయులు, సీహెచ్ చెంచయ్య, బి.శ్రీనివాసరెడ్డి, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోండి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కేంద్రాల్లో విక్రయించటానికి పేర్లు నమోదు చేసుకోవాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కలెక్టరేట్లో మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ రకం పత్తికి రూ.7171, పొడవు రకానికి రూ.7521 చొప్పున కనీస మద్దతు ధరగా చెల్లిస్తారని పేర్కొన్నారు. సీసీఐ, పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా పత్తి కొనుగోలుకు రెండు జిన్నింగ్ మిల్లులను గుర్తించినట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకంతో సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఈ నెల 15 నుంచి సీఎంఏపీపీలో నమోదు చేసుకోవాలన్నారు. సాగుదారులు బాగా ఆరబెట్టిన పత్తిని పర్చూరు మార్కెట్‌యార్డు లేదా జిన్నింగ్ మిల్లుకు తీసుకొచ్చి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. డీఏవో రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిగం సురేష్‌పై నాటి పోలీసుల స్వామిభక్తి

రాళ్ల దాడి కేసు ఎఫ్ఐఆర్‌లో పేరే లేకుండా చేశారు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వ పాలనలో నందిగం సురేష్ అంటే పోలీసులు ఎంతగా స్వామి భక్తి ప్రదర్శించారో ఈ ఉదంతమే ఓ నిదర్శనం. 2020లో రాజధాని గ్రామం వెలగపూడిలో రెండు సామాజికవర్గాల మధ్య చోటుచేసుకున్న రాళ్ల దాడిలో మరియమ్మ అనే వృద్ధురాలు రాయి తగిలి ప్రాణాలు కోల్పోయారు. అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ప్రోద్బలంతోనే ఆ దాడి జరిగిందని, ఈయన్ను మొదటి నిందితుడిగా పేర్కొంటూ మృతురాలి కుటుంబ సభ్యులు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో 37 మంది పేర్లు కూడా రాశారు. తుళ్లూరు పోలీసులు మాత్రం ఎఫ్ఐఆర్ పత్రంతోపాటు కేసు డైరీ (సీడీ)లో ఎక్కడా ఆయన పేరు నమోదు చేయకుండా స్వామి భక్తి చాటుకున్నారు. ఈ విషయంలో స్టేషన్ అధికారులపై ఆనాటి పోలీసు ఉన్నతాధికారుల తీవ్ర ఒత్తిడి పని చేసింది. తెదేపా కూటమి అధికారంలోకొచ్చాక మృతురాలి కుటుంబ సభ్యులు తుళ్లూరు పోలీసులను కలిసి న్యాయం చేయాలని విన్నవించారు. అప్పట్లో అధికార పార్టీ ఎంపీగా సురేష్ ఉండడంతో కేసును నీరుగార్చారని చెప్పారు. స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు ఆనాటి ఘటనపై విచారణకు ఆదేశించారు. అందులో భాగంగానే ఆ కేసులో సురేష్‌పై తుళ్లూరు పోలీసులు మంగళగిరి న్యాయస్థానంలో పీటీ వారెంట్ దాఖలు చేయగా.. కోర్టు అనుమతించింది. ప్రస్తుతం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. తాజాగా పోలీసులు ఆయన్ని 78వ నిందితుడిగా చేర్చారు.



గర్జిస్తున్న కారు మేఘం..

కొరిశపాడు మండలంలో గురువారం వేకువజాము నుంచి చిరుజల్లులు నిరంతరాయంగా కురుస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంగా సాయంత్రం మేదరమెట్లలోని కొండ సమీపంలో దట్టమైన మేఘం కమ్ముకోవడంతో జాతీయ రహదారిపై చీకట్లు కమ్ముకున్నాయి.

– న్యూస్‌టుడే, మేదరమెట్ల

హానికారం

☛ నాసిరకం మిరపతో తయారీ
☛ రసాయనాలతో కృత్రిమ రంగుల వాడకం
☛ చాపకింద నీరులా కల్తీ విక్రయాలు

ఈనాడు, బాపట్ల

ఆసియాలోనే పెద్దదైన గుంటూరు మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లోని కొన్ని మిల్లుల్లో హానికర రసాయనాలు, రంగులతో తయారవుతోంది కల్తీ కారం. రకరకాల పేర్లతో రోజువారీ గిరాకీ ఉండే అల్పాహారశాలలు, మాంసాహార దుకాణాలు, హోటళ్లు, క్యాటరింగ్ పనులు చేసే కొంతమందికి అతి తక్కువ ధరకే అంటగడుతున్నారు. గుంటూరు కారానికి ఉన్న డిమాండ్‌ను ఉపయోగించుకుని ఈ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

మిర్చి తొడిమలు.. తుక్కు కాయలు..
తాలుకాయలు.. వర్షానికి తడిసి రంగు మారి..
చీడపీడలతో దెబ్బతిన్న మిరపకాయలు..
వీటన్నింటినీ పొడిగా చేసి.. రంగులు జోడించి...
సంచుల్లో నింపి...మార్కెట్‌లోకి తెస్తున్నారు...
నాసిగా ఉండే కల్తీ కారం.. మెరిసేదంతా బంగారం కాదన్నట్టు...
ఎర్రగా ఉన్నంత మాత్రాన
అది అసలైన కారమే కాదు.



తయారీ ఖర్చుకంటే తక్కువకే....

పది కిలోల కారం కావాలంటే 12 నుంచి 12.50 కిలోల మిర్చిని మర పట్టించాలి. సగటున కిలో మిరపకాయల ధర రూ. 170 అనుకుంటే.. తొడిమలు, ఇతర వ్యర్థాలు పోగా కిలో కారం తయారీకి రూ. 220 వరకు ఖర్చవుతుంది. ప్యాకింగ్, రవాణా ఇతర ఖర్చులు, లాభం కలిపి కనీసం మరో రూ. 30 వేసుకున్నా.. కిలో రూ. 250కిపైగానే విక్రయించాలి. ప్రముఖ కంపెనీల కారం పొడి ధరలు మార్కెట్లో రూ. 270 నుంచి రూ. 400 వరకు ఉన్నాయి. కానీ.. స్థానికంగా కొంతమంది వ్యాపారులు కిలో కారం రూ. 150 నుంచి రూ. 200కే విక్రయిస్తున్నారు. అదే 25 కిలోల కారం బస్తా కొనుగోలు చేస్తే ఇంకా తక్కువకే వస్తోంది. ఎక్కువగా లూజుగానే విక్రయిస్తున్నారు.


గుంటూరు పట్నంబజార్‌లో తయారీ వివరాలు లేకుండా విక్రయిస్తున్న నాసిరకం కారం

నాణ్యత లేని మిర్చితో..

యంత్రాలతో మిరపకాయల తొడిమి తీస్తుంటారు. ఈ క్రమంలో తొడిమలు, మిర్చి తుక్కు, విత్తనాలతో కలిపి వృథా వస్తుంది. శీతల గోదాములు, మిర్చియార్డులో బస్తాలు అటూఇటూ మార్చే క్రమంలో కొన్ని కాయలు కిందపడి నలిగి తుక్కుగా మారిపోతుంటాయి. వీటిని కిలో రూ. 20 నుంచి రూ. 22 పెట్టి కొనుగోలు చేస్తుంటారు. వీటితో కారం తయారు చేసి రంగులు, రసాయనాలు, పొద్దు తిరుగుడు, పామాయిల్ వంటివి కలిపి ఎర్రగా ఉండేలా చూస్తున్నారు. ఈ యూనిట్లు తక్కు నుంచి విత్తనాలు వేరే చేసే పేరుతో నడుస్తున్నాయి. దీంతో ఎవరికీ అనుమానం రావడం లేదు.

ఎంపిక చేసుకున్నవారికే....

కల్తీ కారాన్ని మార్కెట్లో ఎంపిక చేసుకున్నవారికే బస్తాల్లో వేర్వేరు బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే వస్తుండడం.. అదీ స్థానికంగానే లభిస్తుండడంతో వ్యాపారులు సైతం ఈ కల్తీ కారాన్ని కొంటున్నారు. వీరు అర కిలో, కిలో, ఐదు కిలోలుగా ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి విడిగా విక్రయిస్తున్నారు. గుంటూరు నగరంలోని ఏలూరు బజారు, పట్నం బజారు, మహాత్మాగాంధీ రోడ్డు, ఏటుకూరు రోడ్డు ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలకు రవాణా అవుతోంది. ఎక్కువగా పట్నంబజారు కేంద్రంగానే ఈ వ్యాపారం నడుస్తోంది. కొంతమంది వ్యాపారులైతే రహస్య అరల్లో దాచి మరీ విక్రయిస్తున్నారు. రోజువారీ వినియోగం ఎక్కువగా ఉన్నవారు అడిగి మరీ ఈ నాసిరకాన్ని కొంటున్నారని ఓ వ్యాపారి చెప్పడం గమనార్హం.

జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం

కృత్రిమ రంగులు, రసాయనాలతో కల్తీ అయిన కారంతో చేసిన ఆహారం తీసుకుంటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఈ రసాయనాలు చాలా ప్రమాదకరం. దీర్ఘకాలంలో అల్సర్లతోపాటు కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. అన్నవాహిక, జీర్ణాశయంలో పూతలు వచ్చి పుండ్లు పడొచ్చు. కొన్నాళ్లపాటు కల్తీకారం వాడితే క్యాన్సర్‌కూ దారి తీయొచ్చు. చర్మవ్యాధులు వస్తాయి. నరాల వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది.

- డాక్టర్ దేవినేని సుధీర్‌బాబు, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్ గుంటూరు

మహిళల జీవనోపాధి కల్పనకు ప్రాధాన్యం



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, న్యూస్‌టుడే: మహిళల జీవనోపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. పేద మహిళల జీవనభృతి, ఆర్థిక ఎదుగుదలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద మహిళలను లక్షాధికారులను చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలన్నారు. పీఎంఈజీపీ కింద జిల్లాకు 135 యూనిట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 66 యూనిట్లు మంజూరయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. పీఎంఎఫ్ ఎంఈ పథకం కింద 4,500 యూనిట్లు స్థాపించటానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందన్నారు. రూ. లక్ష నుంచి రూ. 5లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. మహిళలను లక్షాధికారులుగా చేసే కార్యక్రమంలో బ్యాంకర్లు సహకరించి ప్రధాన పాత్ర పోషించాలన్నారు. డీఆర్డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఎల్‌డీఎం శివకృష్ణ, ఉద్యానశాఖ ఏడీ జెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు చర్యలు

జిల్లాలో జలవనరుల సంరక్షణకు ప్రత్యేక దృష్టిసారించి పని చేస్తామని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. జలవనరులపై కేంద్రం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన గురువారం పాల్గొని మాట్లాడారు. జల శక్తి అభియాన్ కార్యక్రమాన్ని నవంబరు 30 వరకు నిర్వహిస్తామన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయటంతో పాటు ప్రతి నీటి చుక్క వృథా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షపు నీరు భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు, నీటి గుంతలు తవ్విస్తామన్నారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేలా చర్యలు చేపడతామన్నారు. నీటి కుంటలు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్వామా పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎట్రాసిటీ కేసుల నివేదికల్లో జాప్యం తగదు

బాపట్ల, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసుల విచారణ నివేదికలు పంపడంలో తహసీల్దార్లు జాప్యం చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రం ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్లో కలెక్టర్ వెంకట మురళిని గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. నాగేంద్రం మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో హత్యకు గురైన ఎస్టీ వర్గానికి చెందిన పిచ్చయ్య కేసులో తహసీల్దారు నేటికీ నివేదిక పంపలేదన్నారు. తహసీల్దారు నివేదిక అందని కారణంగా హతుడి కుటుంబానికి ప్రభుత్వ సాయం అందలేదన్నారు. కలెక్టర్ స్పందించి బాధితులకు పరిహారం సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో సత్తిబాబును ఆదేశించారు. సీ-సెక్షన్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధిక సాంద్రతతో ఉత్పత్తి ఘనం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పొలంలో అధిక సాంద్రతతో పత్తి మొక్కలను విత్తడం ద్వారా ఉత్పత్తి అధికంగా వస్తుందని భారత పత్తి పరిశోధన సంస్థ (నాగపూర్) సంచాలకుడు డాక్టర్ వై. జి. ప్రసాద్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేవీకేలో సాగు చేస్తున్న పత్తి పంటను ప్రసాద్ పరిశీలించారు. కేవీకే ముఖ్య శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం. యుగంధర్‌కుమార్, శాస్త్రవేత్త ఎం. గంగాదేవి పాల్గొన్నారు.

భళా.. బాలిక

- చదువులో వారిదే పైచేయి
- అయినా తప్పని వివక్ష

నేడు అంతర్జాతీయ బాలిక దినోత్సవం



కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

సృష్టికి మూలం స్త్రీ. అలాంటి స్త్రీ పుట్టిన దగ్గర నుంచి వివక్ష ఎదుర్కొంటోంది. బాల్యం నుంచి సమాజంలో అడ్డంకులను అధిగమిస్తూనే జీవన ప్రయాణాన్ని సాగిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది చదువుకు దూరమై తమలోని ప్రతిభను ప్రదర్శించే అవకాశం రాక జీవితాన్ని ముగిస్తున్నారు. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో చైతన్యవంతులైన ప్రజలు తమ పిల్లలను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇవ్వడంతో బాలికలు తమను తాము మెరుగుపరుచుకుంటున్నారు. చదువు.. క్రీడలు.. కళల్లో రాణిస్తున్నారు. పరీక్ష ఏదైనా అందులో బాలికలదే హవా నడుస్తోంది. ఉన్నత విద్యను అభ్యసించే వారిలో ఎక్కువగా బాలికలు, యువతులే ఉంటున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలు, వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాల కారణంగా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకొని దేశం గర్వించే స్థాయికి ఎదుగుతున్నారు.

సృజనకు పదును

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు నిర్వహించే సైన్సు ప్రదర్శనల్లో పాల్గొనే వారిలో 55శాతం మంది బాలికలు ఉంటే, కేవలం 45శాతం మంది మాత్రమే బాలురు ఉంటున్నారు. వీరిలో కూడా స్వతహాగా ఆయా అంశాలపై అవగాహన కలిగి ఉండే వారిలో బాలికలు 85శాతం ఉంటే బాలురు మాత్రం కేవలం 15శాతం మాత్రమే ఉంటున్నారని ఆయా ప్రదర్శనల్లో పాల్గొనే వారి సంఖ్యను బట్టి తెలుస్తోంది. బాలికల మధ్య పోటీ ప్రస్తుతం 25 నుంచి 75శాతానికి పెరిగింది. ఇదే సమయంలో బాలుర మధ్య పోటీ 75 నుంచి 25 శాతానికి పడిపోయిందని ఉపాధ్యాయ సంఘాలు వివరిస్తున్నాయి. ఉన్నత విద్యాభ్యాసం, కొలువులు సాధించే విషయంలోనూ బాలుర కంటే బాలికలు దాదాపు 25శాతం అధికంగా ప్రతిభ చూపుతున్నారని విశ్లేషకులు అంటున్నారు.

హక్కుల పరిరక్షణకే ప్రత్యేక దినోత్సవం

బాలికలపై అత్యాచారాలు, అనర్థాలను నివారించి వారి హక్కులను కాపాడేందుకు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ప్రకటించింది. అమెరికాకు చెందిన పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకాలు చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చారు. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఆమె పుట్టినరోజు అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలిక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. 2012 నుంచి ఏటా ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ సమానతలపై అవగాహన పెంచడమే ముఖ్య ఉద్దేశంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 'బాలికాభివృద్ధి' అంశంతో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



సమాజంలో నేడు బాలికలపై దాడులు, అత్యాచారాలు అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. వీటిని పూర్తిగా అరికట్టాలంటే ప్రభుత్వాలు మరింత నిబద్ధతతో పనిచేయాలి. బాలికా విద్యను మరింత ప్రోత్సహించాలి. బడిబయట పిల్లలను గుర్తించాలి. కొవిడ్ తరువాత బాలిక విద్య కుంటుబడింది. దీన్ని సరిచేయాల్సి ఉంది. వారికి మరిన్ని సౌకర్యాలు అందించి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ వారు రాణిస్తారు. ఇటీవల జరుగుతున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న మహిళలే దీనికి నిదర్శనం.

– అల్లపర్తి ఆంజనేయులు, విశ్రాంత ఎంఈవో, చెరుకుపల్లి

ఆటైనా.. చదువైనా..

ఇటీవల ఎలాంటి పరీక్షలు నిర్వహించినా ఫలితాల్లో బాలికల హవా కొనసాగుతోంది. ఈ ఏడాది ప్రకటించిన పది ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా పది ఫలితాల్లో మొత్తంగా 89శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు అత్యధికంగా 87శాతం వరకు ఉత్తీర్ణత సాధించి బాలురను వెనక్కు నెట్టారు. క్రీడల్లోనూ బాలుర కంటే బాలికలే ఎక్కువగా పాల్గొంటున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు అంటున్నారు. గడిచిన పదేళ్లలో క్రీడల్లో పాల్గొనే బాలుర శాతం 60 నుంచి 40కి పడిపోగా, ఇదే సమయంలో బాలికలు 20 నుంచి 60శాతానికి పెరిగారని వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు లెక్కలు తేల్చాయి.



15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి పీఎఫ్ సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించకుంటే జిల్లాపరిషత్తు కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవలింగారావు అన్నారు. జిల్లాపరిషత్తు కార్యాలయంలో సీఈవో వి. జ్యోతిబసుని బసవలింగారావు ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నాయకులు గురువారం కలిసి పీఎఫ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెలా జీతం నుంచి చెల్లించే పీఎఫ్ చందాలు ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయకుండా.. ఏడాదికోసారి జమ చేయడంతో వడ్డీ నష్టపోతున్నారని తెలిపారు. రుణం పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు మిస్సింగ్ క్రెడిట్స్ ఇవ్వక పోవడంతో రూ. 40 వేల నుంచి రూ. లక్ష వరకు వ్యక్తిగతంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను గతంలో పని చేసిన సీఈవో, కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. మొత్తం 11 సమస్యలు సకాలంలో పరిష్కరించాలని, లేకపోతే ఈ నెలాఖరులో జడ్పీ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. సీఈవోకు వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడు పి. నాగశివన్నారయణ, జిల్లా కౌన్సెలర్లు ఎం. శ్రీనివాసరావు, ఆర్. బాలరాజు, శివరామకృష్ణ ఉన్నారు.



జడ్పీ సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కనీస నిర్వహణ కరవు

జాతీయ రహదారిపైకి ముళ్ల కొమ్మలు



నాయనపల్లి సమీపంలో ఎన్‌హెచ్-216ఏ పై ముళ్ల కొమ్మలు

బాపట్ల, న్యూస్‌టుడే: రహదారి భద్రత విషయంలో ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 216 ఏ జాతీయ రహదారిపై జిల్లా పరిధిలో రెడ్డిపాలెం, చినగంజాంలో రెండు టోల్‌గేట్లు ఏర్పాటు చేసి టోల్ వసూలు చేస్తున్న గుత్తేదారులు రహదారి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. ఈ మార్గంలో భారీ, చిన్న వాహనాలు రోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. స్టూవర్టుపురం నుంచి చినగంజాం వరకు జాతీయ రహదారి పైకి తుమ్మ చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, పొదలు చొచ్చుకొచ్చాయి. ఎన్‌హెచ్ మలుపుల వద్ద దూరంగా వచ్చే వాహనాలు కనిపించటం లేదు. రాత్రి సమయంలో ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు వచ్చిన సమయంలో ద్విచక్రవాహనదారులకు ముళ్ల కొమ్మలు తగిలి గాయాలపాలవుతున్నారు. వాహనాలపై గీతలు పడుతున్నాయి. ముళ్ల పొదలు ఎన్‌హెచ్ పైకి చొచ్చుకొచ్చినా తొలగించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. వాహనదారుల ఇక్కట్లను ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



జిల్లా సరిహద్దులో చినగంజాం టోల్‌గేటు

బ్రాయిలర్ ధరలు

(కిలో క్రీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి హర్షణీయం

వేమూరు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని దేవాలయాలకు వైదిక, ఆగమ అంశాల్లో స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై అర్చక సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆలయాల్లో సంప్రదాయాలను అనుసరించి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అర్చక సేవా సంఘం జిల్లా కన్వీనర్ ఎం. శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వేమూరులో ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల్లో పనిచేసే అర్చకులకు ధూప, దీప నైవేద్య పథకం ద్వారా వేతనాల పెంపు శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం వల్ల దేవాలయాల ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని చెప్పారు. చెరుకుపల్లిలో అర్చక సంఘ నాయకులు స్వర్ణ శ్రీనివాసశర్మ, అగ్నిహోత్రం శేషాచార్యులు, పొన్నపల్లి సత్యనారాయణ, మల్లెల కృష్ణ, చెరుకుపల్లి సుబ్బరామశర్మ, దివి పవన్‌కుమార్ ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు.



వేమూరులో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

మురుకుంటపాడులో పూరిల్లు దగ్ధం

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టటంతో ఓ పూరిల్లు దగ్ధమై రూ. 70వేల ఆస్తినష్టం వాటిల్లింది. సేకరించిన మేరకు వివరాలు.. మండల పరిధిలోని మురుకుంటపాడు గ్రామానికి చెందిన ఇల్లా వెంకమ్మ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. ఆమె ఇంట్లో నిద్రించే సమయంలో గురువారం తెల్లవారుజామున పొగలు రావటంతో ఒక్కసారిగా అప్రమత్తమై కేకలు వేయటంలో చుట్టుపక్కల ప్రజలు వచ్చి నీళ్లు చల్లి మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని దుస్తులు, నిత్యావసరాలు, సామాన్లు కాలిబూడిదయ్యాయి. తాను కట్టుబట్టలతో మిగిలానని, రూ. 70వేల ఆస్తినష్టం వాటిల్లిందని ఎవరో కావాలనే తన ఇంటికి నిప్పుపెట్టారని బాధితురాలు వాపోయింది. గ్రామ వీఆర్వో విజయలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.



పూర్తిగా కాలిన పూరిల్లు

బుసక ట్రాక్టర్ పట్టివేత

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : బుసకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామును గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని బసివిరెడ్డిపాలెం నుంచి పట్టణానికి బుసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మరుప్రోలువారిపాలెం వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించటంతో పాటు డ్రైవర్ కోకి మస్తాన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని మైనింగ్‌శాఖకు అప్పగించినట్లు గ్రామీణ సీఐ కె. గంగాధర్ తెలిపారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

రేపల్లె అర్బన్, అమృతలూరు, న్యూస్‌టుడే: పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు అనే కార్యక్రమం ఈనెల 14 నుంచి ప్రారంభించనున్నట్లు రేపల్లె, అమృతలూరు ఎంపీడీవోలు శోభారాణి, మారుతి శేషమాంబ తెలిపారు. రేపల్లె మండలంలోని 28 పంచాయతీల్లో 20 వరకు జరుగుతాయన్నారు. 14న కారుమూరు, పేటేరు, మోర్లవారిపాలెం, 15న గుడ్డికాయలంక, బేతపూడి, 16న కామరాజుగడ్డనార్త్, చాట్రగడ్డ, పెనుమూడి, 17న కామరాజుగడ్డసౌత్, నల్లూరునార్త్, అరవపల్లి, 18న తుమ్మల, పోటుమెరక, నల్లూరుపాలెం, ఉప్పూడి, 19న చోడాయపాలెం, కైతేపల్లి, వడ్డివారిపాలెం, 20న మోళ్లగుంట, గంగడిపాలెం, లంకెవానిదిబ్బ, పిరాట్లంకలో, అమృతలూరు మండలంలో 14న అమృతలూరు, 15న బోడపాడు, ప్యాపర్రు, 16న ఇంటూరు, 17న కూచిపూడి, 18న గోవాడ, 19న మూల్పూరు, పెదపూడి గ్రామాల్లో జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

ప్లాన్ లేకుండా నిర్మాణం చేపట్టరాదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో బిల్డింగ్ ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వాటికి, నిర్మించబోయే వాటికి తప్పనిసరిగా ప్లాన్ తీసుకోవాలని లేకుంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. మంజూరు చేసిన ప్లాను ప్రకారమే నిర్మాణాలు చేయాలని తెలిపారు. గతంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపామన్నారు. వాటిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో అనధికార లేఔట్లు గుర్తించామని వాటికి ఎల్ఆర్ఎస్ పథకం కింద రెగ్యులరైజ్ చేయించుకోవాలన్నారు. రెగ్యులరైజ్ చేయించని లేఔట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? భవనంవారిపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం రహదారిపైకి ముళ్లపొదలు చొచ్చుకు రావడంతో వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. **- దాసు, భవనంవారిపాలెం**

✔ రహదారి పరిశీలించి ముళ్లపొదలు ఇబ్బందిగా ఉంటే సిబ్బందిని పంపి వెంటనే తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- వసుంధరలక్ష్మీ, గ్రామ కార్యదర్శి, భవనంవారిపాలెం.** – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

టెండర్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగాలి


వేమూరులో దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న అబ్కారీ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు

వేమూరు, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం వ్యాపారులు స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా అధికారులు దృష్టిసారించాలని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు. రేపల్లె, వేమూరులో ఎక్సైజ్ శాఖ కార్యాలయాలను ఆయన గురువారం సందర్శించి మాట్లాడారు. ఇప్పటి వరకు వేమూరు నియోజకవర్గంలో అయిదు మండలాల్లోని 17 దుకాణాలకు అందిన దరఖాస్తుల వివరాలపై సీఐ రవిని ప్రశ్నించగా 139 వచ్చినట్లు ఆయన వివరించారు. తరవాత మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. ఈసారి మద్యం అమ్మకాలపై 20శాతం ఆదాయం నిర్వాహకులకు వస్తుందని చెప్పారు. గతంతో పోల్చుకుంటే 5శాతం ఎక్కువ అని వారికి వివరించారు. రేపల్లె పట్టణం, మండలంలోని ఏడు దుకాణాలకు ఇప్పటి వరకు 84 దరఖాస్తులు వచ్చాయని సీఐ రౌతు దివాకర్ వివరించారు. ఎస్సై రాజశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింది

ఈనాడు కథనానికి స్పందన

అమృతలూరు, న్యూస్‌టుడే: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పడమటి కాల్వ కింద అమృతలూరు మండలంలో ఇంటూరు నుంచి తురుమెళ్ల వరకు సుమారు 4వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాల్వలో తూటుకాడ, గుర్రపుడెక్క ఏపుగా పెరిగి సాగునీరు సకాలంలో దిగువకు వెళ్లక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఈనెల 1న 'పడమటి కాల్వలో పారుదల ఎలా?' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కాల్వలోని గుర్రపుడెక్క, తూటుకాడను యంత్రాల సహాయంతో తొలగించారు. సాగునీటి పారుదలకు ఆటంకం లేకుండా సమస్యను పరిష్కరించారు. దీంతో రైతులు ఆనందం వెలిబుచ్చారు.

అష్టైశ్వర్య ప్రదాయినీ.. దుర్గామాత

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదోరోజు గురువారం జిల్లాలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు ఆలయాలకు పోటెత్తుతున్నారు. మహిళలు వివిధ రకాల పూలతో అమ్మవారికి పూజలు చేసి పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గ బృందం


టౌన్‌హాలు మండపంలో దుర్గాదేవిగా


కన్యకాపరమేశ్వరి ఆలయంలో


వెంకటేశ్వరస్వామి ఆలయంలో


అగ్రహారం ఆలయంలో


పోలేరమ్మ ఆలయంలో


బ్రాహ్మణ సమాఖ్య మండపంలో


శంకర విద్యాలయంలో


మూడో వార్డు మండపంలో


అమృతలూరు: కూచిపూడిలో


బాపట్ల: ఎస్ఎస్‌పీ అగ్రహారం శివాలయంలో



అమృతలూరు: గోవాడలో గారెల దండ అలంకరణలో..


బాపట్ల: శ్రీ మహర్షి గోశాలలో..


శ్రీమహాదుర్గాదేవిగా చందోలు బండ్లమ్మ


సంగుపాలెం కోడూరులో


ఖాజీపాలెంలో దుర్గగా..


అల్లూరులో శ్రీదుర్గాదేవిగా..


చావలి వాలేశ్వరస్వామి ఆలయంలో


జంపని శివాలయంలో


రేపల్లె రైలుపేటలో


కన్యకాపరమేశ్వరి ఆలయంలో


బూరుగలమ్మ గుడిలో


ఇసుకపల్లిలో..


పేటేరులో


చుండూరు మండలం వలివేరులో


భట్టిప్రోలులో శ్రీవాసవీ అమ్మవారు


కావూరులో దుర్గాదేవిగా


నడింపల్లిలో రెడ్డమ్మ అమ్మవారు


నగరం మహా దుర్గాదేవిగా..


గోకర్ణమఠంలో


బాపట్లలో బోనాలతో భక్తుల ఊరేగింపు
భట్టిప్రోలు గ్రామ దేవత గండిపార్వతీ అమ్మవారికి తెప్పోత్సవం


కొల్లూరు: భజన చేస్తున్న భక్త బృందం

శ్రీమానసాదేవికి కుంకుమార్చన

బాపట్ల పట్టణం: మండల పరిధి శ్రీ మహర్షి ఆశ్రమ గోశాలలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం దుర్గాష్టమి పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. గోశాల అధిష్ఠాన దేవత శ్రీనవనాగచైత మానసాదేవి అమ్మవారికి కుంకుమార్చనతో పాటు అమ్మవారి మూలమంత్ర, దుర్గాగణపతి హోమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బాబూనాగేంద్ర దీక్షాపరులతో పూజలు చేయించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం

నిజాంపట్నం: నియోజకవర్గంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెదేపా నేత అనగాని శివప్రసాద్ పేర్కొన్నారు. నిజాంపట్నం జల్సా బజారులో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, ఎంపీటీసీ మేకా రాజేష్‌ఖన్నా, నాయకులు తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, మోపిదేవి హరనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానంలో వడ్డిస్తున్న శివప్రసాద్

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల అందజేత

బాపట్ల పట్టణం: జిల్లా హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెదుళ్లపల్లి శ్రీ గంగాపర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీసరస్వతి అలంకారంలో దర్శనమివ్వటంతో విద్యార్థులు అమ్మవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని వేడుకున్నట్లు సమితి సభ్యులు తెలిపారు.

కుళాయిలిలా.. నీరు పట్టేదెలా?

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే


ఉప్పరపాలెం శివారున మురుగు గుంతలో మంచినీటి కుళాయి

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం కుళాయిలపై పర్యవేక్షణ కరవైంది. కొన్ని కుళాయిలు మురుగు నీటి గుంతల్లో ఉండగా మరి కొన్ని ట్యాప్‌లు లేకపోవటంతో నీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని, చాలా చోట్ల నీరు వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద సిమెంట్ రోడ్ల నిర్మాణాలతో దిగువకు ఉండడం వల్ల ఆ ప్రాంతం గుంతగా మారి మురుగునీరు నిలవడంతో బిందెలతో నీళ్లు పట్టుకోవడం కష్టమవుతోందని మహిళలు వాపోతున్నారు. ఉప్పరపాలెం శివారు రెడ్లపాలెం, విజయలక్ష్మీపురంలోని శ్రీ సత్యనారాయణస్వామి గుడి వద్ద ఉన్న మంచినీటి కుళాయి చుట్టూ గుంతలు ఏర్పడటంతో వర్షాల సమయంలో మురుగునీరు అంతా అక్కడే చేరుతోంది. దీంతో మంచినీటితో పాటు మురుగు నీరు కలిసి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే డ్రైవర్స్‌కాలనీ సమీపంలో మంచినీటి కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవటంతో స్థానికులు కర్ర ముక్కను అడ్డుగా పెట్టటంతో సరఫరా సమయంలో నీరు వృథా అవుతోంది. రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో దిగువకు ఉన్న మంచి నీటి కుళాయిల ఎత్తు పెంచి ట్యాప్‌లను బిగించి సరిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక సంఘం డీఈ శ్రీనివాసులును సంప్రదించగా కుళాయిలను పరిశీలించి ట్యాప్‌లు బిగించటంతో పాటు పైపు లైన్ల ఎత్తు పెంచుతామని తెలిపారు.


డ్రైవర్స్‌కాలనీ సమీపంలో ట్యాప్ లేకుండా..

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఖాళీస్థలాలు

బాపట్ల, న్యూస్‌టుడే


రామ్‌నగర్‌లో ఓ స్థలంలో నీరు
ముత్తాయపాలెం శివారులో తటాకంలా..

నైరుతీ రుతుపవనాల తిరోగమన ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముత్తాయపాలెంలో గత నెలలో డెంగీ జ్వరాలు విజృంభించి ఓ అంగన్‌వాడీ కార్యకర్త మృతిచెందింది. అయినా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితిలో మార్పు రాలేదు. స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. కనీసం దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నీటిలో ఆయిల్స్ బాల్స్ వేసేలా గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

బాపట్ల, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని డంపింగ్‌యార్డు, రక్షిత నీటి పథకం చెరువును అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి వ్యర్థాలు వేరు చేయాలన్నారు. రీసైక్లింగ్, కంపోస్టు ఎరువు తయారీ ద్వారా డంపింగ్ యార్డులో వ్యర్థాలు తగ్గించాలన్నారు. పట్టణ వాసులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలన్నారు. కలెక్టర్ వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్, పురపాలక ప్రత్యేకాధికారి, డీఆర్వో సత్తిబాబును కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. పురపాలక కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని, మహిళలతో వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయించి స్వయం ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ఏఈ ఉమామహేశ్వరరావు, సీఎంఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి చెరువును పరిశీలిస్తున్న పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి

రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు

బాపట్ల, న్యూస్‌టుడే: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ దేశ పారిశ్రామిక రంగాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారన్నారు. తన సంపాదనలో 60 శాతానికి పైగా సమాజ సేవకే ఖర్చు చేసిన గొప్ప దాత అని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలకు ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. రతన్‌టాటా ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

ఎంతో బాధాకరం.. రతన్‌టాటా దేశానికి గర్వకారణంగా నిలిచారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్లలో ఆయన గురువారం మాట్లాడుతూ రతన్‌టాటా మృతి బాధాకరమన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గొప్ప దానశీలి అని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో గొప్ప విజయాలు సాధించారన్నారు.

తీరం నయన మనోహరం



ఆకాశంలో కారుమబ్బులు.. నేలపై పచ్చని తివాచీ పరిచినట్లు పచ్చని పైర్లు ఆపై చల్లని గాలులలతో తీరం అందాలకు చిరునామాగా మారింది. నెల రోజుల క్రితం భారీ వరదల్లో నీట మునిగిన పైర్లు ప్రస్తుతం తేరుకున్నాయి. తీరం గ్రామాలు పచ్చదనంతో పరవశిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. **- న్యూస్‌టుడే, నగరం**

ప్రజలకు జవాబుదారీగా ఉండండి

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మండలంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అధికారులు దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీతారామరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత ప్రజలు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాపట్ల గ్రామీణ సీఐ కె.గంగాధర్ చెప్పారు. మండల పరిధిలోని అప్పికట్ల, భర్తిపూడి గ్రామాల్లో బహిరంగ పోలీస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో తలెత్తే చిన్నపాటి వివాదాలకు కేసులు నమోదు చేసుకుంటే కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, సమయం వృథా అవుతుందన్నారు. యువత నేరాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టిసారించాలని, ప్రస్తుతం కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. వివాదాలు, ఘర్షణలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎగబాకిన నిర్లక్ష్యం.. పొంచిన ప్రమాదం

విద్యుత్తు స్తంభాలకు పలుచోట్ల పిచ్చిమొక్కలు ఎగబాకి ప్రమాదకరంగా తయారయ్యాయి. బాపట్ల మల్లికార్జున బృందావనం వద్ద విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కల తీగలు అల్లుకున్నాయి. దీనివల్ల సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. దీనిపై బాపట్ల విద్యుత్తు శాఖ ఏఈ సాయిశ్రీనివాస్‌ను సంప్రదించగా లైన్‌మెన్లను పంపి పిచ్చిమొక్కల తీగలను తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అమృతలూరు మండలం గోవాడ గ్రామ ప్రవేశంలో విద్యుత్తు స్తంభానికి తీగ ఎగబాకింది. ఈ తీగ విద్యుత్తు లైన్లను సైతం తాకింది. అసలే వర్షాకాలం కావడంతో విద్యుత్తు షార్టుసర్క్యూట్‌తో ప్రమాదం సంభవిస్తుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ నాంచారయ్య మాట్లాడుతూ అల్లుకున్న తీగను సిబ్బంది సహాయంతో తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే బాపట్ల పట్టణం, అమృతలూరు**


అమృతలూరు మండలం గోవాడలో
బాపట్ల మల్లికార్జున బృందావనం వద్ద..

14న బాపట్ల మండల సర్వసభ్య సమావేశం

బాపట్ల పట్టణం: మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.బాబూరావు గురువారం తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆరోజు మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ సీహెచ్ హరిబాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొని పలు శాఖలపై సమీక్ష, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని ఆయన వివరించారు.

17న కర్లపాలెం..

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన ఈనెల 17న ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

చిరుపొట్ట దశలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలి

చెరుకుపల్లి న్యూస్‌టుడే: మండలంలో సాగవుతున్న వరి మరికొద్ది రోజుల్లో చిరుపొట్ట దశకు చేరుకోనుందని ఈ దశలో రైతులు విధిగా నత్రజని ఎరువుతో పాటుగా ఎకరాకు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువు వాడాలని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీగంగాధర్ సూచించారు. పొటాష్ ఎరువు వాడటం వలన పైరుకు తెగుళ్లను తట్టుకొనే శక్తి పెరగటమే కాక, గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. తాలు గింజలు ఏర్పడవన్నారు. మంచు కురిసే సమయంలో కాకుండా పైరుపై మంచుతడి ఆరిన తర్వాత పొటాష్ ఎరువు చల్లాలని ఆయన తెలిపారు.

ముగిసిన శిక్షణ

నగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండ్రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ముగింపు సమావేశంలో కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చడంలో ప్రజాప్రతినిధుల పాత్ర చాలా కీలకమన్నారు. గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో పాల్గొని ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కర్లపాలెం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పేరలికి చెందిన పార్టీ కార్యకర్త దబ్బకూటి నాగేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు అందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నేతలు పమిడి భాస్కరరావు, భూపతిరావు, వసంతరెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అమృతలూరు: ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇంటూరు వైద్యాధికారి ప్రదీప్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెనాలి కోర్టు ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య ఉపకేంద్రంలో మానసిక ఆరోగ్యంపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని జీవనం గడపాలన్నారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్యసిబ్బంది, కోర్టు పీఎల్వీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

మేదరమెట్ల: ఈ నెల 14 నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. కొరిశపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొని మాట్లాడారు. ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రామంల్లో గ్రామసభలు నిర్వహించి గతంలో ఉపాధిహామీశాఖ ద్వారా గుర్తించిన పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

పర్చూరు (మార్టూరు): ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమన కుమార్ తెలిపారు. తొలిరోజు తిమ్మరాజుపాలెం, చెన్నెంబొట్లు అగ్రహారం, అన్నంభొట్లవారిపాలెంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

అద్దంకిలో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న న్యాయవాది మహమ్మద్ రఫీ

అద్దంకి, న్యూస్‌టుడే : శారీరక ఆరోగ్యం తోపాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరం అని పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సభకు హాజరైన న్యాయవాదులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలంటే మానసిక ఉల్లాసం కలిగి ఉండాలన్నారు.

మెరుగైన మద్యం పాలసీ ప్రభుత్వ ఉద్దేశం


మాట్లాడుతున్న సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అద్దంకి: రాష్ట్రంలో మెరుగైన మద్యం విధానాన్ని అవలంబించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. వెంకటేశ్వరరావు అన్నారు. అద్దంకి ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏడు రాష్ట్రాల్లో అమలు చేసే మద్యం విధానాలను పరిశీలించారన్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు అద్దంకి నియోజకవర్గ పరిధిలోని 23 దుకాణాలకు గాను 267 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అద్దంకి పట్టణం, గ్రామీణంలో ఐదు దుకాణాలకు 63, బల్లికురవ 4 దుకాణాలకు 37, కొరిశపాడు నాలుగు దుకాణాలకు 62, జే.పంగులూరు 3 దుకాణాలకు 56, సంతమాగులూరు 5 దుకాణాలకు 36 దరఖాస్తులు చొప్పున అందినట్లు చెప్పారు. ఎక్సైజ్ సీఐ ఏ.భవానీ, ఎస్సైలు ఎస్. హర్షవర్ధనరెడ్డి, జే.వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులోకి వంటనూనెల ధరలు


వినియోగదారుడికి వంటనూనె ప్యాకెట్లు అందజేస్తున్న ఆర్డీవో అఖిల

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వంట నూనెల ధరలు అనూహ్యంగా పెరగడంతో అయిల్ వ్యాపారులతో చర్చించి పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెలను పేదలకు మార్కెట్ ధర కాన్న తక్కువ ధరకు విక్రయించేందుకు ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారని చీరాల ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. గురువారం పట్టణంలో పౌరసరఫరాలశాఖ, నూనె వ్యాపారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రం ద్వారా కిలో పామాయిల్ రూ.115, సన్‌ఫ్లవర్ రూ.125లకు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో వినియోగదారులకు వీటిని పంపిణీ చేశారు. తహసీల్దార్ గోపికృష్ణ, ఇతర అధికారులు ఉన్నారు.


నగరవనం ప్రధాన ద్వారం


చిన్నారుల కోసం ఆట పరికరాలు

నగరవనం.. ప్రకృతి సోయగం

✦ రూ.1.40 కోట్లతో ఆధునికీకరణ
✦ త్వరలో సందర్శకులకు ప్రవేశం

చీరాల అర్బన్, చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నగరవనాలకు ఆటవీ శాఖ ఆధ్వర్యంలో 2015లో శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా వాడరేవు సమీపంలో 125 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత దీని గురించి పెద్దగా ఎవరు పట్టించుకోలేదు. ఫలితంగా మందుబాబులకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. నిత్యం అనేక మంది తీరంలో సందర్శనకు వస్తున్నారు. అదే వారాంతపు సెలవుల్లో అధిక సంఖ్యలో వస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ఆటవీ శాఖ దాదాపు రూ.1.40 కోట్లతో ఇందులో ఆధునికీకరణ పనులు చేయడానికి శ్రీకారం చుట్టింది. అవి 90శాతం పైగా పూర్తయ్యాయి. ప్రవేశ ద్వారానికి రంగులు వేయడంతో చూపరులను ఆకట్టుకునే విధంగా ఉంది. లోపలికి వెళ్లిన వెంటనే కనుచూపు మేర పచ్చదనంతో కనువిందు చేస్తోంది. నవగ్రహ, నక్షత్ర, వినాయక పత్రి, శివపంచాయతన, పంచవటి, కార్తీక, సప్తమణి లాంటి వనాలు, అంతర్గత రహదారులు, చిన్నారులు ఆడుకోవడానికి పరికరాలు, పెద్దల కోసం జిమ్, యోగా మందిరం, గుడిసెలు, బోర్డ్ వాక్, బెంచీలు ఏర్పాటు చేశారు. త్వరలో దీన్ని ప్రారంభించి, సందర్శకులకు ప్రవేశం కల్పించేందుకు వీలుగా అటవీ శాఖాధికారులు ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు.


లోపల కనువిందు చేసే పచ్చదనం


మాట్లాడుతున్న చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి

శాంతియుత సమాజ స్థాపనకు మానసిక ఆరోగ్యం అవసరం

చినగంజాం, న్యూస్‌టుడే: శాంతియుత సమాజ స్థాపనకు మానసిక ఆరోగ్యం చాలా అవసరమని చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త ఎస్డీ మతిన్ పేర్కొన్నారు. చినగంజాం పీహెచ్‌సీలో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం డాక్టర్ ఎస్.విజయభాస్కరరావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రోజూ నడక, యోగాలను చేస్తే మానసిక ఒత్తిడి దరిచేరదని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చీరాల, న్యూస్‌టుడే : ఈపూరుపాలేనికి చెందిన తులసమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి విడుదల అయిన రూ.35వేల చెక్కును గురువారం తెదేపా కార్యాలయంలో నాయకులు లబ్ధిదారురాలికి అందజేశారు. నాయకులు చంద్రమౌళి, గంజిపురుషోత్తం, సాంబయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య వ్యక్తిగత చొరవతో ఈ సహాయం అందిందని వారు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల రెవిన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని ఆక్రమణల చెర నుంచి విడిపించాలని ఆర్డీవో దేవకొండ అఖిలను దళిత నాయకులు గురువారం కలిసి విన్నవించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు వీరు ఆర్డీవోను కలిసి ఈ భూములకు సంబంధించి కొంతమంది తహసీల్దార్లు సకాలంలో నివేదికలు పంపకపోవడంపై ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కారంచేడు మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇచ్చిన భూములకు ప్రభుత్వం రుణమాఫీ చేసి వారికి భూ హక్కు కల్పించాలని వారు కోరారు. నాగేంద్రం, జూలియ, సుబ్బారావు, సృజన్ మాదిగ, గోసాల అశోక్, రవి ఉన్నారు.

చెక్‌డ్యాం గండి పూడ్చరా


చెక్‌డ్యాంకు గండి పడటంతో కిందకు పోతున్న నీరు

కలవకూరు నుంచి కొత్తరెడ్డిపాలెం వెళ్లే దారిలోని చెక్‌డ్యాంకు గండి పడింది. ఈ కారణంగా చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండకుండా దిగువకు వెళ్లిపోతున్నాయి. గతంలో కలవకూరు చెరువు కాలువ నీటి వృథా అరికట్టేందుకు చెక్‌డ్యాంను నిర్మించారు. కొందరు స్థానికులు దీనికి గండి ఏర్పాటు చేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి దిగువకు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా రానున్న వేసవిలో కాలువ నీటి కష్టాలు తప్పవని తక్షణం గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కలవకూరు(అద్దంకి)

పెచ్చులూడిన ఉపాలయం పైకప్పు



కారంచేడు మాధవ స్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామి ఉపాలయ పైకప్పు పెచ్చులు ఊడి, కింద పడటం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. ఏటా ఆదాయం సమకూర్చే ఈ గుడి ఆలనాపాలనా పట్టించుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను భక్తులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కారంచేడు (మార్టూరు)

ప్రయాణం నరకయాతన


గుంతల మయంగా కొమ్మాలపాడు-పరిటాలవారిపాలెం బీటీ రహదారి

కొమ్మాలపాడు-పరిటాలవారిపాలెం తారు రహదారి అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకయాతనంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో మామిళ్లపల్లి, కుందుర్రు, పరిటాలవారిపాలెం గ్రామాల్లోని పది వేల మందికి పైగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి ఈ పరిస్థితి ఉన్నా మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే లేరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లు ఈ మార్గంలో ప్రయాణించాలంటే నరకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణం పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కొమ్మాలపాడు (సంతమాగులూరు)


కారంచేడులో..


మార్టూరు తూర్పుబజారులో..


పర్చూరులో..


మార్టూరులో..


సోపిరాల శివాలయంలో..


ఈపురుపాలెంలో..


పావులూరు రామమందిరంలో..


పేరాలలో..


వేటపాలెంలో..


పోలేరమ్మ గుడిలో..


దత్తపాడుకాక్షేత్రం వద్ద..


జే పంగులూరులో..


దైవాలరావూరులో..

దుర్గమ్మా.. మము దీవించమ్మా

చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదోరోజు గురువారం అమ్మవారు దుర్గా దేవిగా పూజలందుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులు పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు. శ్రీచక్ర సహిత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద 53 కిలోల లడ్డూ ప్రసాదాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ రామకోటేశ్వరరావు, పాలకమండలి సభ్యులు కలిసి రిక్షాపై ఊరేగించారు.


53 కిలోల లడ్డూ ప్రసాదం ఊరేగిస్తున్న వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ

–న్యూస్‌టుడే బృందం


నాగరాజుపల్లి శివాలయంలో..


స్వర్ణలో..

దగ్గుబాడులో నేత్రదానం


బుల్లెమ్మ (పాతచిత్రం)

దగ్గుబాడు (ఇంకొల్లు): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిగింది. దగ్గుబాడుకు చెందిన బీరం బుల్లెమ్మ(91) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు ఎస్.రామమోహనరావు, జెట్టి స్వామి పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి మృతురాలి కార్నియాలను సేకరించారు. రోటరీ ప్రతినిధులు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఇళ్లు ఖాళీ చేయించవద్దని వినతి

చీరాల గ్రామీణం: నలభై ఏళ్లగా నివాసం ఉంటున్న తమను ఇళ్లు ఖాళీ చేయాలని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారని, వీటిని నిలిపి వేయాలని కోరుతూ..ఈపూరుపాలెం ఆంజనేయస్వామి గుడి వెనుక బాధితులు గురువారం మండల పరిషత్తు అధికారులకు వినతిపత్రం అందించారు. నిరుపేదలమైన తమ సమస్య పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే న్యాయ స్థానం ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించిన ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు అందించినట్లు పంచాయతీ అధికారులు వివరణ ఇచ్చారు.

కొనసాగిన వైద్య శిబిరం

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం గ్రామాల్లో ఆరో రోజు గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి తొమ్మింది మందికి వైద్య పరీక్షలు చేసినట్లు చినగంజాం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి ఎస్ విజయభాస్కరరావు తెలిపారు. వారిలో ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్న ఒకరికి ర్యాపిడ్ పరీక్షలు చేయగా డెంగీ, మలేరియా జ్వరాలు లేవన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

అంకమ్మ ఆలయ అనంత వార్షికోత్సవం

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండలంలోని చింతపల్లిపాడులో వేంచేసియున్న అంకమ్మ తల్లి ఆలయ అనంత వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం వేదపండితుడు నారాయణం శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో హోమాది పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుంకుమార్చన పూజల్లో మహిళలు పాల్గొని అమ్మవారికి అర్చనలు చేశారు.

ఆ మృతదేహం శానంపూడి వాసిది

మార్టూరు: మండల పరిధిలోని ఏబీసీ కాల్వలో బయటపడిన మృతదేహం పల్నాడుజిల్లా శావల్యాపురం మండలం శానంపూడి వాసిదిగా మార్టూరు పోలీసులు గుర్తించారు. బుధవారం జంగమహేశ్వరపురం సమీపంలోని సాగర్ కాల్వలో 34 ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. గుర్తుతెలియని మృతదేహంగా భావించిన మార్టూరు పోలీసులకు శావల్యాపురం పోలీసులు మృతుడు అమృతపూడి నాగేశ్వరరావుగా తెలిపారు. ఈ నెల 7న నాగేశ్వరరావు కనిపించకుండా వెళ్లినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్కడి స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారని మార్టూరు పోలీసులు తెలిపారు.

ప్రయాణికుల అవసరాల అనుగుణంగా ఆర్టీసీ సేవలు


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచి ఉన్న బస్సులు

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తుంది. దసరా పండుగ నేపథ్యంలో వేర్వేరు ప్రాంతాల్లో నివశించే వారిని స్వగ్రామాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి వేర్వేరు ప్రాంతాలకు 62 బస్సులు నడుపుతున్నారు. ఇందులో 25 అద్దె బస్సులుండగా 37 ఆర్టీసీ బస్సులున్నాయి. ప్రస్తుత సీజన్‌లో రోజుకు రూ.తొమ్మిది లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. సాధారణ రోజుల్లో రెండు సర్వీసులు హైదరాబాద్‌కు తిరుగుతుంగా ప్రస్తుతం రెండు అదనపు బస్సుల్ని నడుపుతున్నారు. అలాగే విజయవాడకు ఎనిమిది బస్సులు తిరుగుతుండగా దసరా నేపథ్యంలో అదనంగా మూడు బస్సుల్ని తిప్పుతున్నారు. ప్రతి 10 నిముషాలకు ఒంగోలుకు పల్లెవెలుగు సర్వీసులు, ప్రతి 30 నిముషాలకు డబుల్‌స్టాప్‌లు తిరుగుతున్నాయని డిపో మేనేజరు బెల్లం రామ్మోహనరావు తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు సర్వీసులను నడిపేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

రతన్ టాటా ఎందరికో ఆదర్శం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: గొప్ప వ్యక్తిత్వం, దేశభక్తి కలిగిన రతన్ టాటా ఎందరికో ఆదర్శం, అలాంటి వ్యక్తి మరణించడం దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైకాపా ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల గురువారం విడుదల చేసిన ప్రకటనలో వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అద్దంకి, న్యూస్‌టుడే : దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతోమంది పేదలకు ఉపాధి అవకాశాలు చూపిన వ్యక్తిగా అభివర్ణించారు. విలువలతో కూడిన పారిశ్రామిక వేత్తగా భావించి భారతరత్న అవార్డు అందించి గౌరవించిందని పేర్కొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో కిరణ్‌కుమార్

మార్టూరు, న్యూస్‌టుడే: రైతులు సాగులో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ కేవీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కోలలపూడిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగాణి సాగుచేస్తున్న రైతులకు సాగులో పలు సూచనలు చేశారు. రైతులు పండించే పంటలో చీడపీడల నివారణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఏవో వీరగంధం కిరణ్ కుమార్, వీఏఏ గోపికిరణ్ ఉన్నారు.


సంఘీభావం తెలుపుతున్న ఐఎల్‌టీడీ కార్మికులు

కార్మిక చట్టాల మార్పుపై పోరాడాలి

చీరాల, న్యూస్‌టుడే : పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం మారుస్తుందని దీనికి వ్యతిరేకంగా కార్మికులంతా ఒక్కటై పోరాడాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు అన్నారు. పెరంబదూరులోని శ్యామ్‌సంగ్ ఇండియా ప్లాంట్‌లో కార్మికుల పోరాటానికి మద్దతుగా గురువారం ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టీడీ కంపెనీ కార్మికుల యూనియన్ నాయకులు ఐఎల్‌టీడీ కంపెనీ వద్ద సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు, సుధాకరరావు, మాట్లాడుతూ కంపెనీకి లాభాలు తెస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి మాజమాన్యం చొరవ చూపాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు

వేటపాలెం, కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వేటపాలెం పంచాయతీ కార్యదర్శిగా మోహన రంగారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బల్లికురవ మండలం గొర్రెపాడు పంచాయతీ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న శవనం రాజశేఖరరెడ్డి నగరం పంచాయతీకి బదిలీ అయ్యారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కార్యదర్శిగా వి.రామమోహనరావు బాధ్యతలు తీసుకున్నారు. ఈయన ఒంగోలు డీపీఆర్‌సీలో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామ కార్యదర్శిగా చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

నామ్ రహదారిపై యథేచ్ఛగా లోడింగ్, పార్కింగ్

అద్దంకి, న్యూస్‌టుడే : నామ్ రహదారిపై అద్దంకి పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాల పార్కింగ్, లోడింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతో ఒక్కోసారి రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. దసరా పండుగ సందర్భంగా దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువుకునే వారు సొంత ప్రాంతాలకు వస్తుంటారు. అమరావతి, విజయవాడ నుంచి రాయలసీమకు; హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు అద్దంకి మీదుగా ప్రయాణించాల్సి ఉంది. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి అద్దంకి పట్టణ పరిధిలోని భవానీకూడలి వద్ద విస్తరణ పనులు జరగలేదు. ఈ కారణంగా కొద్దిపాటి వాహనాలు నిలిచినా నాలుగు వైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవల కాలంలో ఈ ఇబ్బందుల నేపథ్యంలో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. అయినా భవానీకూడలి నుంచి దామావారిపాలెం వరకు రహదారి పక్కనే వాహనాల లోడింగ్, పార్కింగ్ వంటివి జరుగుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ పి.కృష్ణయ్యను వివరణ కోరగా ట్రాఫిక్ ఆగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. లోడింగ్, పార్కింగ్ ప్రదేశాల్లోని దుకాణ యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు.


భవానీకూడలి వద్ద రోడ్డుపైనే పాత ఇనుము లారీలోకి లోడింగ్

దాడిపై కేసు నమోదు

అద్దంకి, న్యూస్‌టుడే : పట్టణంలోని నంబూరిపాలేనికి చెందిన ఒంటెద్దు గోపీపై పట్టణానికి చెందిన చైతన్య, మరో ముగ్గురు కలిసి కళ్లల్లో కారం చల్లి దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన ఈనెల 8న హోలీ ఫెయిత్ పాఠశాల వద్ద చోటు చేసుకుంది. జ్యోతిష్యం చెబుతూ జీవనం సాగించే గోపీని నిందితులు చైతన్య పాఠశాల వద్దకు రావాల్సిందిగా కోరారు. బాధితుడు అక్కడకు వెళ్లగా చైతన్యతో పాటు మరో ముగ్గురు యువకులు గోపీ పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో జ్యోతిష్యం చెప్పకుండా వెనుదిరిగిన వెంటనే కళ్లలో కారం చల్లి, ద్విచక్ర వాహనాన్ని బురదలో పడేశారు. దీన్ని గుర్తించిన స్థానికులు యువకుల బారి నుంచి గోపీని తప్పించి ఇంటికి పంపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్ భాషా తెలిపారు.

రతన్ టాటా చెప్పిన ఆర్థిక సూత్రాలు...

రతన్ టాటా గురించి ఆలోచించినప్పుడు మనకు గుర్తుకొచ్చేది ఏమిటి? వ్యాపార రంగంలో ప్రపంచానికి భారత శక్తిని చాటి చెప్పిన ఒక గొప్ప వ్యాపారవేత్త అనే కదా. దీన్ని సాధించే క్రమంలో ఆయన ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. త్యాగాలూ చేశారు. డబ్బును సంపాదించడం, దాన్ని నిర్వహించే విషయంలో ఆయన సూచనలు ఎప్పుడూ ఆచరణీయం. ఆయన చెప్పిన కొన్ని సూత్రాలేమిటంటే..



నైతికతతో...

అందరమూ డబ్బు సంపాదించాలనే చూస్తుంటాం. డబ్బును వెంబడించడం చాలా ముఖ్యం. కానీ, దాన్ని నైతికతతో చేయాలి. సంపాదన న్యాయంగా ఉన్నన్ని రోజులూ ఆర్థికంగా విజయం సాధిస్తూనే ఉంటాం. చెడు మార్గంలో, తొందరగా డబ్బును కూడబెట్టాలనుకుంటే మాత్రం పతనం ప్రారంభమవుతుంది.

ఇవ్వడం నేర్చుకోండి..

మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడే అన్నీ తిరిగి మనకు అందుతాయి. మంచి పనులు, డబ్బు ఈ రెండింటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవసరంలో ఉన్న వారిని మీరు ఆర్థికంగా ఆదుకుంటే.. మీకు కావాలి అనుకున్నప్పుడు మీ రూపంలోనైనా, ఎవరి నుంచైనా సహాయం అందుతుంది. అది మీకు వృత్తిలోనూ, ఆర్థికంగానూ మేలు చేకూరుస్తుంది.

అవకాశాలు తీసుకోండి..

అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా అనే ధోరణి నుంచి బయటపడాలి. అప్పుడే మీరు డబ్బు విషయంలోనూ, వృత్తి, ఉద్యోగ జీవితంలోనూ వృద్ధి సాధిస్తారు. అవకాశాలను వదులుకోవద్దు. ధైర్యంగా, భిన్నంగా ఉండాలి. ప్రతి రోజూ మీ గురించి మీరు సమీక్షించుకోవడం ఎంతో అవసరం.

నిర్ణయాలను గౌరవించండి..

మీరు తీసుకునే నిర్ణయాలను విశ్వసించండి. మంచివా, చెడువా అనేది తర్వాత విషయం. ఒక నిర్ణయం తీసుకునే ముందే దాని గురించి పూర్తిగా విశ్లేషించుకోవాలి. ముఖ్యంగా డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు. దాని ఫలితం ఎలా ఉంటుందో ముందే అంచనా వేసుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక, దాన్ని సరైనదిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలి.

తెలివిగా పెట్టుబడులు..

ఒకే చోట పెట్టుబడులు పెట్టడం వల్ల డబ్బు సంపాదించే అవకాశాలను కోల్పోతాం. అందుకే, వైవిధ్యానికి పెద్దపీట వేయాలి. ఎన్నో రంగాల్లో విస్తరించిన టాటా గ్రూపు ఇందుకు ఉదాహరణ. మన పెట్టుబడులూ అనేక పథకాల్లో ఉండేలా చూసుకోవాలి. ఇందులో కొన్నింటిలో నష్టభయం ఉండొచ్చు. కొన్ని సురక్షితంగా కనిపిస్తాయి. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలం.

క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో మదుపు చేస్తున్న వారి సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారిలో చాలామంది యువతే ఉంటున్నారని ఇటీవలి నివేదికలూ చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేవారు అనుసరించాల్సిన వ్యూహాలు తెలుసుకుందాం.



ఇవీ ముఖ్యమే...

- మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలో క్రమశిక్షణతో ఉండండి. ఫండ్‌లను ఎంపిక చేసుకునేటప్పుడు కేవలం స్వల్పకాలిక రాబడిపైనే దృష్టి పెట్టొద్దు.
- ఇటీవలి కాలంలో మంచి పనితీరు చూపిస్తే, దానినే ఆ ఫండ్లను ఎంచుకోవడానికి ప్రామాణికంగా చూడొద్దు.
- దశల వారీగా పెట్టుబడులు కొనసాగించండి. మార్కెట్ పడిపోతున్నప్పుడూ పెట్టుబడులు కొనసాగాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడంపైనే దృష్టి సారించండి.
- ప్రారంభంలోనే ఒకే రంగానికి పరిమితమయ్యే సెక్టోరియల్ ఫండ్లపై ఎక్కువగా దృష్టి పెట్టొద్దు.
- మార్కెట్లో అస్థిరతకు సిద్ధంగా ఉండాలి. సూచీల్లో 10-20 శాతం క్షీణత సర్వసాధారణం. ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న మదుపరులు 30 శాతం తగ్గినా ఇబ్బంది లేదు అనే ధోరణితో ఉండాలి.

సిరి

కొత్తగా సిప్ చేస్తుంటే

స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయుల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటప్పుడు పెట్టుబడులు కొంచెం నష్టభయంతో కూడుకున్నవే. అయినప్పటికీ.. సిప్ ద్వారా మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు వీలుంది.

నిధిని సృష్టించండి: అత్యవసర పరిస్థితుల్లో దీర్ఘకాలిక పెట్టుబడుల నుంచి డబ్బును తీయకుండా ఉండాలి. ఇందుకోసం కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే మొత్తం మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. ఇందుకోసం లిక్విడ్ ఫండ్లలో సిప్ చేయొచ్చు.

మధ్యస్థ కాలానికి: చాలామంది యువ పెట్టుబడిదారులకు కొన్ని మధ్యస్థ కాల లక్ష్యాలు ఉంటాయి. ఇలాంటి అవసరాల కోసం విడిగా మదుపు చేయాలి. ఉదాహరణకు కారు కొనాలని అనుకోవచ్చు. లేదా ఇంటి కోసం ముందస్తు చెల్లింపు కావచ్చు. ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యేకంగా ఒక సిప్‌ను ప్రారంభించాలి. స్వల్పకాలిక డెట్ ఫండ్లను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు.

దీర్ఘకాలిక లక్ష్యంతో: మీరు సాధించాల్సిన లక్ష్యం 15-20 ఏళ్లు, అంతకు మించి ఉంటే.. దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టాలి. పిల్లల ఉన్నత చదువులు, మీ పదవీ విరమణ లాంటివి ఇందుకు ఉదాహరణ. ఇందుకోసం నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఆధారంగా 80-90 శాతం వరకూ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు ప్రారంభించాలి.

కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే వారు నిఫ్టీ లేదా సెన్సెక్స్ సూచీల ఆధారంగా పనిచేసే లార్జ్ క్యాప్ ఫండ్లను పరిశీలించాలి. ఈక్విటీలంటేనే అస్థిరతకు మారుపేరు. వీటికి మానసికంగా అలవాటు కావాలి. ఇందుకోసం కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది. ఆ తర్వాతే నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ వంటి వాటికి కొంచెం ఎక్కువ మొత్తంలో పెట్టుబడిని కేటాయించాలి.

పెట్టుబడుల్లో కాస్త అనుభవం వచ్చాక దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకోవాలి. ఇందులో 70-80 శాతం వరకూ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్లు, వాల్యూ ఫండ్, లో వోలటాలిటీ ఫండ్లవంటివి ఉండాలి. ఆ తర్వాతే.. అధిక రాబడి కోసం ప్రయత్నించాలి. స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో అస్థిరత అధికంగా ఉంటుంది. అదే సమయంలో లాభాలకూ అవకాశం ఉంటుంది. అనుభవం వచ్చాకే వీటిపై దృష్టి పెట్టాలి.

వైవిధ్యంగానూ: కేవలం ఈక్విటీల్లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. డెట్, బంగారం, ఇతర పథకాలనూ పరిశీలించాలి. పెట్టుబడుల్లో కనీసం 20 శాతం వరకూ వీటికి కేటాయించాలి. అప్పుడే పోర్ట్‌ఫోలియో స్థిరంగా ఉంటుంది.

షేర్ల విలువ తగ్గినప్పుడు...

స్టాక్ మార్కెట్లో కొన్ని సందర్భాల్లో మంచి కంపెనీల షేర్లూ తక్కువ ధరకు లభిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో మదుపు చేసినప్పుడు దీర్ఘకాలంలో మంచి లాభాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యూహంతోనే యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. యాక్సిస్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ అందుబాటులో ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం ఇండెక్స్ ఫండ్స్ రకానికి చెందింది. నిఫ్టీ 500 వాల్యూ 50 టీఆర్ఐ సూచీ ప్రామాణికంగా పనిచేస్తుంది. నిఫ్టీ 500లో వాస్తవిక ధరకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కంపెనీలను ఎంచుకొని, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తుంది. దీర్ఘకాలం పాటు మదుపు చేయాలనుకునే మదుపరులకు ఈ పథకం అనుకూలమని చెప్పొచ్చు.

వేచి చూసే వ్యవధి తక్కువగా

ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నప్పుడు ముందస్తు వ్యాధుల చికిత్సకు సాధారణంగా 36 నెలల పాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. దీనికి భిన్నంగా పాలసీ తీసుకున్న 31 రోజు నుంచే ఇలాంటి వ్యాధుల చికిత్సకు పరిహారం అందించేలా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ 'సర్వ' పేరుతో సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీలో ప్రధానంగా మూడు ఆప్షన్లు ఉన్నాయి. సర్వ ప్రథమ్‌లో క్యాన్సర్, గుండె జబ్బులు ఇతరత్రా వ్యాధుల చికిత్సకు సంబంధించి రూ.3 కోట్ల వరకూ బీమాను తీసుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్తమా, ఊబకాయం వంటి ముందస్తు వ్యాధుల చికిత్సకూ 31 రోజుల తర్వాత పరిహారం లభిస్తుంది. సర్వ ఉత్తమ్‌లోనూ సారథి అనే ఆప్షన్ కింద 31 రోజు నుంచి ముందస్తు వ్యాధుల చికిత్సకు పరిహారం అందుతుంది. ఇక సర్వ పరమ్‌లో ఎలాంటి వేచి ఉండే వ్యవధీ లేదు. ఇందులో 'గుల్లక్ అడ్వాంటేజ్' ఆప్షన్‌లో క్లెయిములతో సంబంధం లేకుండా ఏటా 100 శాతం వరకూ పాలసీ విలువ పెరుగుతుంది. ఇలా గరిష్ఠంగా 10 రెట్ల వరకూ పాలసీ విలువ అధికం అవుతుంది. వీటన్నింటిలోనూ ఆసుపత్రిలో చేరే 90 రోజుల ముందు, ఇంటికి వచ్చాక 180 రోజుల వరకూ అయ్యే ఖర్చులు చెల్లించేలా ఏర్పాటు ఉంది. రూ.3 కోట్ల వరకూ వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీని అందిస్తాయి. గడువు ముగియడానికి 30 రోజుల ముందే పాలసీని పునరుద్ధరిస్తే ప్రీమియంపై 2.5 శాతం వరకూ రాయితీ లభిస్తుంది. ఇద్దరు లేదా అంతకు మించి కుటుంబ సభ్యులకు కలిసి ఒకే పాలసీని తీసుకుంటే 10 శాతం వరకూ 'ఫ్యామిలీ డిస్కౌంట్' అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

కొత్త పథకం

జీవితాంతం పింఛను అందేలా

పదవీ విరమణ అనంతరం జీవితాంతం వరకూ పింఛను అందించే డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్‌ను రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని పేరు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ నిశ్చిత్ పెన్షన్. ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం 2041 నాటికి దేశ జనాభాలో 15.9 శాతం మంది 60 ఏళ్లకు పైబడిన వారే ఉంటారు. ఈ నేపథ్యంలో పింఛను పథకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా చిన్న కుటుంబాలు పెరుగుతున్నందున ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా డిఫర్డ్ యాన్యుటీ పథకాలు తోడ్పడతాయని సంస్థ పేర్కొంది. ఈ పాలసీలో జీవితాంతం వరకూ పింఛను వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ తర్వాత జీవిత భాగస్వామి, పిల్లలకు, తోబుట్టువులకూ పింఛను అందే ఏర్పాటు చేయొచ్చు. 5 నుంచి 10 ఏళ్ల వరకూ పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు ఉంది. ఏదైనా అనుకోని అనారోగ్యం, వైకల్యం సంభవించినప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వీలుంది.

13న ఆర్య సమాజంలో బిరుదు ప్రదానాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు అరండల్‌పేట 11/3లోని ఆర్యసమాజంలో ఈనెల 13న ఉదయం 8 గంటలకు పలువురికి బిరుదు ప్రదానం చేయనున్నట్లు పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా బిరుదు ప్రదానంతో పాటు సత్కారాలు చేయనున్నట్లు చెప్పారు. మృతదేహాల వద్దకు రావాలంటేనే జంకు చూపే పరిస్థితుల్లో అంత్యేష్టి కార్యక్రమాలు నిర్వహించిన ప్రఖ్యాత వైదిక ధర్మ ప్రచారకురాలు, ఆర్య సమాజం గుంటూరు మాజీ అధ్యక్షురాలు కోనేరు జానకీదేవిని ఆర్యమాత బిరుదుతో సత్కరిస్తామన్నారు. దశాబ్దాలుగా ఆర్య సమాజ సిద్ధాంతాలను ఆచరించి ప్రచారం చేస్తున్న వైదిక ధర్మప్రచారకుడు కొత్తమాసు మల్లికార్జునరావును ఆర్యపురుష బిరుదుతో, పెరూలో జరిగిన జూనియర్ వరల్డ్ షూటింగ్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన నేలవల్లి ముఖేష్‌కు వైదిక శుభాశీస్సులతో సత్కారాలు జరుగుతాయన్నారు.

నిజాంపట్నం, న్యూస్‌టుడే: మండలంలో బావాజీపాలెం పంచాయతీలో అదవల- నిజాంపట్నం రహదారిని అభివృద్ధి చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇది నిర్మిస్తే అదవల గ్రామ ప్రజలు నిజాంపట్నం చేరడానికి మార్గం దగ్గర కావడంతో పాటు వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. గ్రామంలో సుమారు 500 మంది ప్రజలకు మేలు జరుగుతుంది. 2 కి.మీ లోపు ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేస్తే తీర గ్రామ ప్రజలకు కష్టాలు తీరుతాయి. వర్షం పడితే చుట్టూ రెండు కిలో మీటర్లు దూరం తిరిగి రావాల్సి వస్తోంది. తద్వారా ప్రయాణానికి అదనపు వ్యయం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. తమ సమస్య పరిష్కరించి వెతలు తీర్చాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా సమస్య తమదృష్టికి రాలేదని ఉన్నతాధికారులతో చర్చించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నిధులు మంజూరు చేస్తే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

అదవల వెళ్లాలంటే అష్టకష్టాలే!



అదవల- నిజాంపట్నం డొంక మార్గం

మహిషాసురమర్దిని శిల్ప ఛాయాచిత్ర ప్రదర్శన



మహిషాసురమర్దిని శిల్ప చరిత్ర వివరిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

చుండూరు, న్యూస్‌టుడే: శ్రీ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చుండూరు మండలం మోదుకూరులోని వేమన కళాపరిషత్తు భవనంలో తొట్టెంపూడికి చెందిన యువ పురావస్తు పరిశోధకుడు శ్రీనాథ్‌రెడ్డి మహిషాసురమర్దిని శిల్ప చరిత్రపై ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో శతాబ్దం నుంచి కుషాన్లు మట్టితో తయారు చేసిన అమ్మవారికి పూజలు చేసి యుద్ధానికి వెళ్లే వారని తెలిపారు. అంతేకాదు దేశంలోని వివిధ ప్రాంతాలను పాలించిన గుప్తులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు అమ్మవారి శిల్పాన్ని ఏకశిల, లోహాలతో తయారు చేసి యుద్ధానికి వెళ్లే ముందు తమ సైన్యానికి శక్తిని ప్రసాదించాలని కోరుతూ పూజలు చేసేవారని వివరించారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు వచ్చిన వారికి 2 నుంచి 16వ శతాబ్దం మధ్య అమ్మవారి ప్రతిమల తీరును వివరించారు. ప్రదర్శనను కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యురాలు పి.హైమావతి ప్రారంభించారు. చాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసిన యువ పురావస్తు పరిశోధకుడు శ్రీనాథ్‌రెడ్డిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కె.సుధాకరరెడ్డి, సీతారామరెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దుకు డిమాండ్



ఎస్టీయూ నేతలతో మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే జీవో 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయానికి వచ్చిన ఆయన గురువారం మాట్లాడారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని, పీఆర్సీ బకాయిలు త్వరగా ఇవ్వాలని కోరారు. దసరాకు 30శాతం ఐఆర్ ప్రకటించటంతో పాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. కరోనాతో మరణించిన వారి కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్, సభ్యులు జి.అమర్నాథ్, ఎన్.బి సుభానీ, పీవీ నాగరాజు, ఉదయ్ శంకర్, ఏవీ నారాయణ, శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.